# పోలవరం ప్రాజెక్టు వద్దే వద్దు

## ఆదివాసుల ఉనికినే విధ్వంసం చేసే ఈ డ్యామ్‌ను వ్యతిరేకిద్దాం

అడవినీ, అడవే ఆవాసంగా ఆధారంగా జీవిస్తున్న తమనూ, తమ రేలపాటనూ తుడుంమోతనూ నిలువెత్తు నీటిలో ముంచి నాశనం చేసే పోలవరం ప్రాజెక్టు వద్దు అని ఆదివాసులు ముక్తకంఠంతో అరుస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు కట్టకపోతే ఎలా అంటోంది. ఆదివాసీల జీవితాలను ఛిద్రం చేసైనాసరే, ఆదివాసుల రక్షణ కోసం నిర్దేశించిన చట్టాలనన్నింటినీ ఉల్లంఘించైనా సరే కట్టితీరుతామంటోంది. ఈ ప్రహసనంలో న్యాయాన్యాయాల ప్రస్తావనే ఉండదు. అబద్ధాలు, డబ్బు, రాజకీయ, సాంఘిక బలాల నుండి వచ్చే దబాయింపు మాత్రమే కనబడుతుంది.

ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను ఇంకా పోషించటానికి, లక్షలాది ఆదివాసులను ముంచే పోలవరం ప్రాజెక్టుని ఎట్టి పరిస్థితిలో కట్టనీయమని సమన్యాయం, ప్రజాస్వామ్యం కాంక్షించే వాళ్లందరం మరోమారు నినదిద్దాం. సహజ సంపదలతో వర్ధిల్లుతున్న ప్రపంచాన్ని ఎందుకు నాశనం చేస్తున్నామో ప్రశ్నించడమే మర్చిపోయిన ఆదివాసేతర సమాజానికి అది మళ్లీ గుర్తుచేద్దాం.

ఆ హోదా, ఈ హోదా అంటూ పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా జాతీయ హోదా కల్పించాలని రోజూ ఎవరో ఒకరు అనడం వింటున్నాం. అసలు ఇటువంటి విధ్వంసకరమైన ప్రాజెక్టుకు ఏ హోదా అయిన ఎందుకని అడుగుతున్నాం మనం. ఒక్క మన రాష్ట్రంలోనే మూడు జిల్లాల్లో, ప్రధానంగా భద్రాచలం డివిజన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో దాదాపు మూడు వందల గ్రామాలను ముంచే ప్రాజెక్టు ఇది. సుమారు 2 లక్షల 65 వేల మందిని, అందులో అధికభాగం ఆదివాసులను నిర్వాసితులను చేసే ప్రాజెక్టు ఇది. వేల ఎకరాల విలువైన అడవిని మాయం చేసే ప్రాజెక్టు ఇది. గోదావరి నదికి అటూ ఇటూ తొమ్మిది మండలాల్లో, ప్రధానంగా ప్రకృతి సంపదపై ఆధారపడి జీవిస్తున్న కోయ, కొండరెడ్ల బతుకులను ప్రశ్నార్థకంగా మార్చే ప్రాజెక్టు ఇది. నీటిపై సమాన హక్కు ఒక ప్రజాతంత్ర విలువని అనుకుంటున్న రోజుల్లో గోదావరి నీళ్లు తప్ప మరో గత్యంతరం లేని ఉత్తర తెలంగాణా జిల్లాల నీటి హక్కును దెబ్బతీసే ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు కోసం సేకరించ తలపెట్టిన స్థలం ఆదివాసీ ప్రజలది. భారత రాజ్యాంగంలో 244(1) వ అధికరణం కింద గుర్తింపు పొందిన ఐదవ షెడ్యూల్ ప్రాంతమిది. జీవ వైవిధ్యాన్ని, వృక్ష, జీవ, ప్రకృతి సంపదను రక్షిస్తూ వస్తున్న ప్రాంతమది. వీటిని కాపాడుతూ వస్తున్న కోయలూ, కొండరెడ్లూ జీవించే స్థలమిది. వారి జ్ఞాన సంపదలకి, సంస్కృతికి పుట్టినిల్లు అది. పోలవరం ప్రాజెక్టు ఈ ప్రకృతి సంపదనేకాక, వాటిని కాపాడుతూ వస్తున్న ఆదివాసీ ప్రజల ఉనికిని కూడా విధ్వంసం చేస్తుంది.

ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారికి గొప్ప పునరావాస ప్యాకేజి ఇస్తున్నామని ప్రభుత్వం పదేపదే అంటుంది. అసలు పునరావాసం అనేమాటకు అర్థం ఏమిటి? ఆదివాసులను వాళ్లు నివసించే భూభాగం నుండి వేరుచేస్తే వాళ్ల ఉనికికే ప్రమాదమని వీళ్లకు తెలియదా? ఆదివాసీ ప్రజల ఆర్థిక వ్యవస్థ వారు నివసిస్తున్న ప్రకృతితో ముడిపడి వుంది. ఆ జీవన వ్యవస్థలో అన్ని ప్రాణరాశులు, వన్యప్రాణులు, చెట్లు, భూమి, నీరు, అడవి, జీవం వున్న అన్నీ కలిసిమెలిసి జీవిస్తున్నాయి. వాటిలో ఏ ఒక్కటి దెబ్బతిన్నా ఈ భూమికే ప్రమాదం. ప్రకృతితో పెనవేసుకుని వున్న జీవన విధానానికీ దాని నుండి వచ్చే ఆత్మస్థైర్యానికీ ఆదివాసులు దూరమవుతారు. ప్రభుత్వం ఎన్ని తీయటి కబుర్లు చెప్పినా, దానిని తిరిగి ఏ రూపంలోనూ వారికి కల్పించడం అసాధ్యం. అందుకే ఆదివాసుల జీవన శైలిలో పునరావాసం అనే మాటకు అర్థమేలేదు. ఉన్న భూభాగం నుంచి, పరిసరాల నుంచి వేరైతే అవి ఇచ్చే ఆదాయం, ఆహారం మొత్తం జారిపోతాయి. దీనికి ఏ నష్టపరిహారం, ఏ ప్రత్యామ్నాయమూ సాధ్యంకాదు.

ఎన్నో పోరాటాల ఫలితంగా ఆదివాసులు అనేకహక్కులు పొందగలిగారు. కాని వాటి అమలు విషయానికొస్తే అవే చట్టాలు పూర్తి అపహాస్యానికి గురవుతున్నాయి. 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపచేస్తూ పంచాయితీరాజ్ షెడ్యూల్ ప్రాంత విస్తరణ చట్టం 1996 ('పెసా') వచ్చింది. దీనికింద స్వయం పాలనా నిర్ణయాధికార వ్యవస్థలైన ఏజెన్సీ గ్రామాలెన్నో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల కనుమరుగు అవుతాయి.

'పెసా'కి ఏనాడు జీవం కల్పించే ప్రయత్నం పాలకులు చేయలేదు. అంతేకాదు ఆదిమ తెగయిన కొండరెడ్డి ప్రజలకు, సమూహాలకు రక్షణ కల్పించే అనేక చట్టాలను ఈ ప్రాజెక్టు ఎగతాళి చేయబోతున్నది. పాపికొండల అభయారణ్య భూములలో వన్యప్రాణుల రక్షణ కొరకు చేసిన చట్టాలనూ, అడవిని పెంచే భారత అటవీ విధానాన్నీ, అనేక ఇతర అటవీ సంరక్షణ చట్టాలనూ పోలవరం ప్రాజెక్టు హేళన చేస్తుంది.

**ఫిబ్రవరి 19, 20 తేదీలలో ఖమ్మం జిల్లా వేలేరుపాడు, కుకునూరు మండలాల్లో జరిగే పోలవరం వ్యతిరేక ప్రచారయాత్రలో పాల్గొనండి**

# పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన అటవీ అనుమతిని రద్దు చేయాలి

**వేదాంత సరే, మరి పోలవరం మాటేమిటి?**

ఈ మధ్యనే విన్నాము. ఒరిస్సాలోని కలహండి జిల్లాలో నియంగిరి కొండల్లో వేదాంత అనే కంపెనీకి బాక్సైట్ తవ్వుకోడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని నిరాకరించిందని. అక్కడ ప్రధానంగా 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006' ఉల్లంఘన జరిగిందని ప్రభుత్వం పేర్కొంది. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో చట్టాన్ని పూర్తిగా గౌరవించాలని, ఎట్టి పరిస్థితిలో ఆదివాసీ హక్కులను కాలరాయడానికి వీలులేదని ప్రభుత్వం అన్నది.

మరి పోలవరం మాటేమిటి? వేదాంతతో పోల్చుకుంటే ఇది ఇంకా విధ్వంసకర ప్రాజెక్టు. ఇక్కడ ఉల్లంఘనలు వెయ్యి రెట్లు ఎక్కువ జరిగాయి. అటవీ భూముల్లో తరతరాలుగా నివసిస్తూ, ఆధారపడి జీవిస్తూ వస్తున్న ఆదివాసీ ప్రజల, ఇతర అటవీ సాంప్రదాయక నివాసుల హక్కులను గుర్తించడంలో చారిత్రక అన్యాయం జరిగిందని ఒప్పుకుంది ప్రభుత్వం. ఆ అవగాహన నుండి పుట్టిన 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006' పోలవరం ప్రాజెక్టు విషయంలో అసలు అమలైందెక్కడ? ఒకటా, రెండా ఎన్ని ఉల్లంఘనలు? ఇప్పటిదాకా ఏ హక్కులూ తేల్చకుండానే ప్రాజెక్టు పనులను మాత్రం చేపట్టేస్తున్నారు. అటవీ భూములను పోలవరం ప్రాజెక్టుకు బదిలీ చేసే విషయంలో స్థానిక ఆదివాసుల అంగీకారం అటుంచి, కనీసం ఏ సంప్రదింపూ జరగలేదు. అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయకుండానే, దాన్ని అమలు పరిచినట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు తప్పుడు సమాచారంతో కూడిన నివేదికనిచ్చింది మన రాష్ట్ర ప్రభుత్వం.

**ప్రచారయాత్ర**

**ఫిబ్రవరి 19, ఉ॥ 10 గం॥లకు – వేలేరుపాడు మండలం కొయిదా గ్రామంలో మొదలై కాచారం, టేకూరు, బొర్రెడ్డిగూడెం, కట్కూరు, యడవల్లి, చిత్తెంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బొల్లపల్లి, కొత్తూరు, మెట్టగూడెం, నార్లవరం, కన్నాయిగుట్ట మీదుగా సాగి వేలేరుపాడు చేరుతుంది.**

**ఫిబ్రవరి 20, ఉ॥ 8 గం॥లు – వేలేరుపాడులో మొదలై తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, రుద్రంకోట, లచ్చిగూడెం, వసంతవాడ, కుకునూరు మండలంలో అర్వాయిపల్లి, నెమలిపేట, దాసవరం, బెస్తగూడెం, రామన్నగూడెం, కుకునూరు, కివక, మారేడుబాక, కొండపల్లి, వింజరం, చీరవల్లి–మాదవరం, దామరచెర్ల, ఉప్పేరు, రాజీవ్‌నగరం, అమరవరం, కోమట్లగూడెం, కమ్మరిగూడెం మీదుగా సాగి తొండిపాకలో ముగుస్తుంది.**

ఈ తప్పుడు సమాచారం ఆధారంగా అటవీ భూమి ముంపును ఆమోదిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, 28 జూలై 2010న అనుమతి పత్రం కూడా జారీ చేసింది. దీన్నే ఫారెస్ట్ క్లియరెన్స్ అంటారు. ఈ బూటకపు అనుమతిని రద్దు చేయమని, జరిగిన ఉల్లంఘనలపై విచారణ జరపాలనీ ఇప్పటికే ఉభయగోదావరి, ఖమ్మం జిల్లాల నుండి 52 గ్రామ సభల తీర్మానాలు ప్రభుత్వానికి అందాయి. ఇటువంటి తీర్మానాలు ఇతర గ్రామసభలు కూడా పంపాల్సిన అవసరం వుంది.

అనేక ఉద్యమాలతో సాధించుకున్న హక్కులనూ, చట్టాలనూ ప్రభుత్వాలు ఇట్లా అపహాస్యం చేస్తూ పోతుంటే మనం ఎందుకు ఊరుకోవాలి? ఈ ప్రాజెక్టుని పూర్తిగా రద్దు చేసి, మన హక్కులను గౌరవించే దాకా ఉమ్మడిగా ఆందోళన కొనసాగిద్దాం. అభివృద్ధి పేరుతో మన జీవితాలపై సమాధులు కట్టనివ్వమని గట్టిగా చెబుదాం. విధ్వంసకర అభివృద్ధి నుండి సుఖాలు పొందుతున్న వారి కోసం ఇక మేం త్యాగాలు చేయడానికి సిద్ధంగా లేమని చెబుదాం. నిజమైన అభివృద్ధి అంటే అందరి బాగు అని గుర్తుచేద్దాం.

ఇప్పుడు అమలులోవున్న అభివృద్ధి నమూనాపై బలమైన ప్రశ్నలను మానవ హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ లేవనెత్తారు. అన్ని ప్రజాతంత్ర ఉద్యమాలను ఆయన వెన్నంటి వున్నారు. పోలవరం ప్రాజెక్టు ఆదివాసుల జీవితాలను ధ్వంసం చేస్తుందనీ దానిని నిలువరించడానికి ఉమ్మడి కార్యాచరణ అవసరమనీ ఆయన భావించారు. బాలగోపాల్ గారి ఆశయాల స్ఫూర్తితో ఈ ప్రచార యాత్ర సాగుతోంది. పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకించి, ఆదివాసీ ప్రజలకు అండగా నిలబడమనీ, భవిష్యత్ తరాల కోసం ప్రకృతి వనరులను కాపాడుకోవటానికి కలసి రమ్మనీ కోరుతూ...

**– మానవ హక్కుల వేదిక, తుడుం దెబ్బ, నాయకపోడు సేవా సమితి, కొండరెడ్ల సంక్షేమ సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ సేన, ఆదివాసీ ఐక్యవేదిక, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ప్రజా సంఘాల జెఏసి, ఆదివాసీ చైతన్య సమితి, తెలంగాణా విద్యార్థి వేదిక, మాల మహానాడు, మన్యసీమ రాష్ట్ర సాధన సమితి, ఏజెన్సీ దళిత సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, ఏజన్సీ దళిత విద్యార్థి సంక్షేమ సంఘం, పోలవరం వ్యతిరేక పోరాట కమిటి, నాట్వాన్ సంఘం, ఆదివాసీ యువజన సంఘం, ఏజెన్సీ న్యాయవాదుల ఫోరం, ఆదివాసీ విద్యార్థి సంఘం.**

**తేదీ :10-2-2011**

*ప్రచురణకర్తలు : ఎస్. జీవన్‌కుమార్ – 9848986286, డి. ఆదినారాయణ – 9440511049*